క్లుప్తంగా

రూ.1.66లక్షల నగదు పట్టివేత

తిరుమలగిరి : తిరుమలగిరి మండలంలోని వెలిశాల చెక్‌పోస్టు వద్ద మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా రమేష్, రవి అనే వ్యక్తుల నుంచి రూ.1.66 లక్షల నగదు, డ్రెస్ మెటీరియల్ స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో జిల్లా ట్రెజరీ కార్యాలయంలో అప్పజెప్పినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ దార శ్రీనివాస్ తెలిపారు.

మద్దిరాలలో రూ.1.80లక్షలు పట్టివేత

మద్దిరాల: మండల పరిధిలోని కుంటపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం వాహనాల తనిఖీల్లో భాగంగా తొర్రూర్ నుంచి బొలేరో వాహనంలో ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1.80లక్షల నగదును సీజ్ చేసినట్లు సీఐ బ్రహ్మమురారి తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ రవీందర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రత్యేక ఆఫర్లతో పునఃప్రారంభం

సూర్యాపేట : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీవిఘ్నేశ్వర సిల్క్ సెంటర్ పునఃప్రారంభం సందర్భంగా ప్రత్యేకమైన ఆఫర్లను అందిస్తున్నట్లు సిల్క్ సెంటర్ నిర్వాహకుడు బొమ్మగాని సైదులు గౌడ్ తెలిపారు. పునఃప్రారంభం సందర్భంగా ఈ నెల 16, 17 తేదీల్లో రూ.10లకే 600ల చీరలు మహిళలకు అందజేశామని తెలిపారు. విజయదశమి, దీపావళి సందర్భంగా మహిళలకు 50 శాతం డిస్కౌంట్‌తో పట్టు చీరలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆఫర్లను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి.సతీష్‌గౌడ్, ఉమేష్ చంద్ర, బబ్బి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై కళాజాతా



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఆత్మకూర్ (ఎస్) : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని రామోజీతండాలో సారధి కళాకారుల ఆధ్వర్యంలో మంగళవారం కళాజాతా ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కళాకారులు ఓటు హక్కు విలువ, తదితర అంశాలను తమ ఆటపాటలతో వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల టీం లీడర్ వేముల నరేష్, గంట భిక్షపతి, ఈర్ల సాయి, వేముల శ్రవణ్, మాగి శంకర్, చేటూరి నిర్మల, స్రవంతి, రాధ, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు



ఇసుక అక్రమ రవాణా జరుగకుండా పోలీసులు తవ్వించిన గుంత

తిరుమలగిరి : తాటిపాముల గ్రామ శివారులోని బిక్కేరు వాగులో ఇసుకను అక్రమంగా తరలించకుండా పోలీసులు గుంతలు తవ్వించారు. సాక్షి దిన పత్రికలో ఈ నెల 16న ప్రచురితమైన యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా కథనానికి పోలీసులు స్పందించారు. బిక్కేరు వాగులోకి ఇసుక ట్రాక్టర్లు వెళ్లకుండా జేసీబీ సహాయంతో పెద్ద గుంతలు తీయించారు.

మొక్కలను సంరక్షించాలి

సూర్యాపేట రూరల్ : నీళ్లు పోసి మొక్కలను సంరక్షించాలని, ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం తాళ్లఖమ్మంపహాడ్ గ్రామంలోని నర్సరీలో మొక్కలకు నీళ్లు పోసి మాట్లాడారు. 18ఏళ్లు నిండిన వారు ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ భరత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రేవతి పాల్గొన్నారు.

అలుపెరుగని పోరాట యోధుడు ఓంకార్

దురాజ్‌పల్లి : ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపకుడు మద్దికాయల ఓంకార్ అలుపెరుగని పోరాట యోధుడని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వరికుప్పల వెంకన్న అన్నారు. మంగళవారం ఓంకార్ 15వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని బీఎన్‌రెడ్డి విగ్రహం వద్దం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి షేక్ నజీర్, నాయకులు సోమన్న, శబరి, రాములు, శంకర్, శ్రీను, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపక నేత ఓంకార్ 15వ వర్ధంతిని ఆ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓంకార్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి నలుగూరి రమేష్, మహేష్, నాగయ్య, అనిల్, నర్సయ్య, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గ్రామాల్లో బెల్టుషాపుల జోరు!

- ఎన్నికల కోడ్ ఉల్లంఘించి మద్యం విక్రయాలు
- పట్టించుకోని అధికారులు



పస్తాలలోని ఓ బెల్ట్‌షాపులో పట్టుబడిన మద్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు(ఫైల్)

నాగారం : ఎన్నిక నిబంధనలను తుంగలో తొక్కి గ్రామాల్లోని బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగిస్తున్నారు. నాగారం మండలంలోని వివిధ గ్రామాల్లో బెల్ట్‌షాపుల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. సోమవారం సివిల్ పోలీసులు బెల్ట్‌షాపులపై దాడులు చేయగా పస్తాల గ్రామంలో ఒక షాపులోనే సుమారు రూ.5,000 మద్యం పట్టుబడింది. ఇలాంటి మద్యం దుకాణాలు మండలంలో ఇంకా చాలానే ఉన్నాయి. మద్యం బెల్ట్ షాపుల నిర్వహణపై నిషేధం ఉన్నప్పటికీ వీటిని నియంత్రించడంలో ఆబ్కారీ అధికారులు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. బెల్ట్‌షాపుల ద్వారా రోజూ వేలాది రూపాయల మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. కాగా మండలంలో కొందరు మద్యం మాత్రమే అమ్ముతుండగా మరికొందరు ఏకంగా సిట్టింగ్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. నాగారం మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి గ్రామంలో సుమారు ఆరు నుంచి పదివరకు బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారు. మద్యం విక్రయదారులు ఎమ్మార్పీ ధర కంటే ఒక్కొక్క బాటిల్‌పై రూ.30 నుంచి రూ.50 అదనంగా వసూలు చేస్తూ మందుబాబుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులపై దాడులు చేయాల్సి అధికారులే మద్యం వ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్నారనే ఆయా గ్రామాల్లో ఆరోపణలు వస్తున్నాయి.

అమ్మకాలు పెంచుకోవడానికి..

ఎన్నికల సమయంలో అమ్మకాలను పెంచుకోవడం కోసం మద్యం దుకాణ వ్యాపారులే బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మండలంలో సుమారు 120 నుంచి 150 బెల్ట్ షాపులు ఉన్నాయి. పైగా వైన్‌షాపులలో లభించని పలు బ్రాండ్ల మద్యం బెల్ట్‌షాపులలో లభిస్తుండటం గమనార్హం.

కేసులు నమోదు చేస్తాం



ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో బెల్ట్ షాపులను నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే గ్రామాల్లోని బెల్ట్ షాపు నిర్వాహకులకు మద్యం విక్రయాలు జరపొద్దని సూచించాం. అలాగే బెల్ట్‌షాపులకు మద్యాన్ని విక్రయించొద్దని వైన్స్ యజమానులకు కూడా సూచించాం. అక్రమంగా బెల్ట్‌షాపులను నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– బాలాజీ నాయక్, ఎక్సైజ్ సీఐ, తుంగతుర్తి

సామాన్యులను ఇబ్బందులకు గురిచేయొద్దు



తిరుమలగిరిలో చెక్ పోస్టు వద్ద పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే



తుంగతుర్తి పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుమలగిరి : చెక్ పోస్టుల వద్ద సాధారణ ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేయొద్దని ఎస్పీ రాహుల్ హెగ్డే పోలీసులకు సూచించారు. తిరుమలగిరిలో ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన అంతర్ జిల్లాల సరిహద్దు చెక్ పోస్టును మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. చెక్ పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, స్వాధీనం చేసుకున్న నగదు వివరాలను రికార్డు చేయాలని అన్నారు. పోలీస్ తనిఖీల్లో సాధారణ ప్రయాణికులకు, స్థానిక ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూడాలని తెలిపారు. పౌరులు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించేలా రక్షణ కల్పించాలన్నారు. ఆయన వెంట సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం, నియోజకవర్గ ఎన్నికల పోలీస్ మోడల్ అధికారి రవి, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ రాజేష్, మహేష్, సీఐలు శివశంకర్, మురారి, ఎస్ఐలు ప్రసాద్, ప్రవీణ్, సైదులు, అంజిరెడ్డి, రవీందర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

తుంగతుర్తి : అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. పోలీసు స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసులు, భౌగోళిక మ్యాపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో పోలీసులు ఒత్తిడికి గురికాకుండా పనిచేయాలన్నారు. నిఘాను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయనతో పాటు డీఎస్పీలు నాగభూషణం, రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ మహేష్, సీఐలు మురారి, శివశంకర్, ఎస్ఐలు ప్రవీణ్, సైదులు, ప్రసాద్, అంజి రెడ్డి, రవీందర్, సిబ్బంది ఉన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



తిరుమలగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్



తుంగతుర్తిలో..

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. మంగళవారం శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో తిరుమలగిరి, నాగారం, అర్వపల్లి మండలాల పూర్తి స్థాయి కమిటీలు, గ్రామ శాఖ, మండల శాఖ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ప్రతి బూత్ కమిటీ సభ్యుడు వంద ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు తెలియజేయాలని కోరారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దళిత బంధు, బీసీ బంధు, గృహ లక్ష్మి, రైతు బంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు లబ్ధిదారులకు ఎలా అందుతున్నాయో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుజ్జ యుగేందర్‌రావు, మార్కెట్ చైర్‌పర్సన్ కొమ్మినేని స్రవంతిసతీష్‌కుమార్, ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, జెడ్పీటీసీ దూపటి అంజలిరవీందర్, పార్టీ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, ఉప్పలయ్య, సోమేష్, రావుల వీరప్రసాద్, కొమ్మినేని సతీష్ పాల్గొన్నారు.

తుంగతుర్తి : ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సిరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన తుంగతుర్తి, నూతనకల్, మద్దిరాల మండలాల బూత్ స్థాయి, గ్రామశాఖ, మండల శాఖ కమిటీల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి బూత్ కమిటీ సభ్యుడు 100 ఇళ్లకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మూడోసారి కేసీఆర్‌ను సీఎంగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గుజ్జ యుగంధర్ రావు, రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్ఏ రజాక్, ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి క్రీడా పోటీలు

నాగారం : పస్తాల గ్రామంలో బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి కబడ్డీ, కోలాట పోటీలు నిర్వహిస్తున్నట్లు పస్తాల కబడ్డీ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కబడ్డీ ప్రథమ బహుమతి రూ.20,016, ద్వితీయ 18,016, తృతీయ 16,016, చతుర్ధ 14,016, పంచమ బహుమతి 12,016, కోలాట పోటీల్లో ప్రథమ బహుమతి రూ.10,016, ద్వితీయ 8,016, తృతీయ 5,016, చతుర్ధ 3,016 అందించనున్నట్లు పేర్కొన్నారు.

రుణమాఫీ అమలు చేయాలి

అర్వపల్లి : సగం మంది రైతులకు ఇంకా రుణమాఫీ అమలు కాలేదని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకుడు వజ్జె శ్రీనివాస్ చెప్పారు. రుణమాఫీని వెంటనే అమలు చేయాలని మంగళవారం మండల అధికారులకు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. ఇప్పటి వరకు సగం మంది రైతులకు రుణమాఫీ వారి ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు. రుణమాఫీ సొమ్ము రాక, కొత్త రుణాలు అందక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం రుణమాఫీని అమలు చేశామని చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు.

ఆస్పత్రుల్లో అందుబాటులో వైద్యులు లేక ఇబ్బంది

తుంగతుర్తి : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సమయానికి వైద్యులు లేకపోవడంతో పాము కాటుకు గురైన మహిళ ఇబ్బంది పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. తుంగతుర్తికి చెందిన ఉప్పుల లింగమ్మ మంగళవారం పాము కాటుకు గురైంది. దీంతో ఆమెను కుటుంబీకులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ ఆస్పత్రిలో ఒక్క డాక్టర్ కూడా అందుబాటులో లేరు. దీంతో ఆమెను మరో ఆస్పత్రికి తరలించేందుకు 108కు సమాచారం ఇచ్చారు. కానీ అంబులెన్స్ రావడానికి సుమారు 2గంటలు సమయం పట్టింది. చివరకు ఆ మహిళను సూర్యాపేట పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కానీ అక్కడ కూడా డాక్టర్లు, సిబ్బంది ఉదయం వచ్చి మధ్యాహ్నం వరకే వెళ్లిపోతున్నారని, వైద్య సేవలు అందడం ఇబ్బందిగా మారిందని బాధిత మహిళ బంధువులు ఆరోపించారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



భానుపురి : పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

భానుపురి/చివ్వెంల : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన నివాసంలో చివ్వెంల మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన తిక్కల ఆంజనేయులు ఆధ్వర్యంలో 3వ వార్డు మెంబర్ యాట నరహరితో పాటు 50 కుటుంబాలు పటేల్ రమేష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అక్రమాలతో ప్రజలు విసిగిపోయారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమానికి తీసుకొచ్చిన 6 గ్యారంటీ పథకాలతో బీఆర్ఎస్ పార్టీ పతనం ప్రారంభమైందని అన్నారు. కార్యక్రమంలో ముదిరెడ్డి రమణారెడ్డి, వెలుగు వెంకన్న, షఫీఉల్లా, యాట ఉపేందర్, వల్దాసు దేవేందర్, యాట రామకృష్ణ, మర్రిపడిగ సంజీవ, దాసరి శ్రీకాంత్, మస్తాన్‌రావు, రామారాజు, మహేష్, నాగరాజు, సందీప్, సైదులు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పిడమర్తి రవి



తుంగతుర్తిలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

తుంగతుర్తి : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి తుంగతుర్తి నియోజకవర్గ అభ్యర్థిగా బరిలో ఉంటానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాను తెలంగాణ ఉద్యమంలో పనిచేశానని, కాంగ్రెస్ పార్టీ త్వరలో ప్రకటించే జాబితాలో తన పేరు వస్తుందని ఆశ భావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గంలో బలంగా ఉందన్నారు. గతంలో తుంగతుర్తిలో కాంగ్రెస్ పార్టీ స్వల్ప మెజార్టీతో ఓడిపోయిందని.. కానీ ఈసారి భారీ మెజార్టీతో గెలుస్తుందన్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు పెద్దబోయిన అజయ్‌కుమార్, మిట్టగడుపుల రమేష్, సుధాకర్, కొండ రాజు, రమేష్, వెంకన్న తదితరులు ఉన్నారు.

అవిలమల్లుకు పరామర్శ

మద్దిరాల : కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి మంగళవారం కుక్కడం గ్రామంలో ఆయనను పరామర్శించారు. ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ముక్కాల రాంమూర్తి, కూజ ఎల్లేష్, మారెల్లి మహేష్, సాయి, తదితరులు ఉన్నారు.

అసెంబ్లీ టికెట్ రావాలని పూజలు

నాగారం : తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకుడు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవికి కాంగ్రెస్‌పార్టీ నుంచి తుంగతుర్తి అసెంబ్లీ టికెట్ రావాలని మంగళవారం మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో ఫణిగిరిలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ జేఏసీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాల ప్రవీణ్ మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు అధికంగా ఉన్నారని అన్నారు. ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన పిడమర్తి రవికి టికెట్ ఇస్తే నియోజకవర్గంలోని ఎస్సీలతోపాటు అన్నివర్గాల ప్రజలు అధిక మెజార్టీతో గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఆయనతోపాటు పలువురు మాదిగ జేఏసీ నాయకులు తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

పెన్‌పహాడ్ : వానాకాలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై మంగళవారం అధికారులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మండడి మహేందర్‌రెడ్డి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని తూర్పార పట్టి 17శాతంలోపు తేమ ఉండేలా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. పెన్‌పహాడ్ మండలంలో 10 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బి.కృష్ణసందీప్, ఏపీఎం అజయ్ నాయక్, పీఏసీఎస్ సీఈఓ సోమ్లా, ఏఈఓలు, సీసీలు, వీబీకేలు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : ధాన్యం సేకరణకు మండలంలో 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్, ధాన్యం కొనుగోలు కేంద్రాల మండల నోడల్ అధికారి జక్కర్తి శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం సెర్ప్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై నిర్వాహకులు, వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈసారి ఏ గ్రేడ్ ధాన్యాన్ని క్వింటాకు రూ. 2,203, సాధారణ ధాన్యాన్ని క్వింటాకు రూ. 2,183 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి శుభ్రం చేసుకొని కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. అలా తెస్తేనే ప్రభుత్వ మద్దతు ధర దక్కుతుందని చెప్పారు. ఈ సమావేశంలో ఏఓ ఆర్.శశిధర్‌రెడ్డి, ఏపీఎం మల్లేష్, మండల అధ్యక్షురాలు గాదరి జయమ్మ, సీసీలు నగేష్, చందు, పద్మావతి, సీఈఓలు మేడబోయిన రామస్వామి, ఊర సత్యనారాయణ, ఏఈఓ శోభారాణి, అకౌంటెంట్ లింగంపల్లి ఈశ్వరి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుండా మళ్లీ హామీలు



తిరుమలగిరిలో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా డివిజన్ కార్యదర్శి అఖిల్‌కుమార్

తిరుమలగిరి : ప్రజా సమస్యలు పరిష్కరించని అధికార బీఆర్ఎస్ పార్టీ మళ్లీ మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు వస్తోందని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా డివిజన్ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ అన్నారు. మంగళవారం వెలిశాల గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ బీజేపీ బీ టీమ్‌గా మారిందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ఇచ్చే మోసపు వాగ్దానాలను నమ్మ వద్దని ప్రజలకు సూచించారు. గత తొమ్మిది సంవత్సరాల నుంచి ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు వేముల నాగయ్య, గొడ్డలి నర్సయ్య, కందుకూరి కొండన్న, నర్సయ్య, భూక్యా రామ్‌జీ, రాములు, రమేష్, నగేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దుర్గామాత నవరాత్రోత్సవాలు



తుంగతుర్తిలో పూజలు చేస్తున్న భక్తులు



అర్వపల్లిలో కొమురంభీం యూత్ ఆధ్వర్యంలో..



తిరుమలగిరి: అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



నాగారం : ఫణిగిరిలో..



నూతనకల్ : ఎర్రపహాడ్‌లో..

తిరుమలగిరి : దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గామాత మంగళవారం అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు. తెలంగాణ చౌరస్తాలో ఏర్పాటు చేసిన మండపం వద్ద నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.

నాగారం : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని పసునూర్, పస్తాల, వర్ధమానుకోట, ఫణిగిరి, మాచిరెడ్డిపల్లి, డి.కొత్తపల్లి, నాగారం, ఈటూరు తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన కనకదుర్గా మాత విగ్రహాల వద్ద భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడవ రోజు అమ్మవారు అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం అమ్మవారు అన్నపూర్ణ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచింది.

నూతనకల్ : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో దుర్గామాత విగ్రహాల వద్ద మంగళవారం పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారు అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చింది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



బతుకమ్మలను ఎత్తుకెళ్తున్న మంత్రి సతీమణి సునీత, తదితరులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనంతారం గ్రామంలో సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మూడో రోజు నాన బియ్యం బతుకమ్మ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి జగదీష్‌రెడ్డి సతీమణి గుంటకండ్ల సునీత పాల్గొన్నారు. మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేశారు. అలాగే గ్రామంలో నెలకొల్పిన దుర్గాదేవి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి, జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్య, సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ మామిడి రేవతిపరంధాములు, మహిళలు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకురాలు మృతి

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలపరిధిలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు శివరాత్రి లింగస్వామి తల్లి, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు శివరాత్రి చిన్నక్క మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆమె మృతదేహానికి జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో గ్రామశాఖ అధ్యక్షుడు ఓర్సు వెంకన్న, తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనిరెడ్డి శేఖర్ రెడ్డి, శ్రీరాములు, ముడావత్ తనుష్, లింగస్వామి, కంచెర్ల పాండు, పున్నయ్య, గణేష్, నాయకులు, తదితరులు ఉన్నారు.

డీఎస్పీ సూర్యాపేట అభ్యర్థిగా కిరణ్‌కుమార్



భానుపురి : ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా సూర్యాపేట పట్టణానికి చెందిన చెరుకు కిరణ్‌కుమార్ ఖరారయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ ఈ నెల 16న రాష్ట్రవ్యాప్తంగా 53 అసెంబ్లీ స్థానాలకు ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో కిరణ్‌కుమార్‌కు చోటు కల్పించారు. కిరణ్‌కుమార్ డీఎస్పీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజనుల రాజ్యాధికారానికి ప్రతిఒక్కరూ కలిసి రావాలన్నారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని సూర్యానాయక్‌తండాలో అమ్మ ఒడి చిరునవ్వు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఈ నెల 22 వరకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.10,016, ద్వితీయ బహుమతి రూ.7,016 ఇవ్వనున్నట్లు చెప్పారు. క్రీడల్లో పాల్గొనే జట్లు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 6303122429, 93925 85176 సెల్ నంబర్లను సంప్రదించాలని వారు సూచించారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

మోతె : ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ సుందరి కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పథకం కింద మండలంలో గత రెండేళ్లుగా నిర్వహించిన పనులపై ఓపెన్ ఫోరం నిర్వహించారు. రూ.17.64 కోట్ల పనులు, చెల్లింపులపై నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎస్టీఎం అజయ్, ప్రవీణ్, ఎస్సార్పీ రమేష్, విజిలెన్స్ అధికారి ఆశారాణి, ఎంపీడీఓ వెంకటాచారి, ఏపీఓ మహేష్, ఎంపీఓ హరిసింగ్‌నాయక్ పాల్గొన్నారు.

వర్ధమానుకోట వాసికి గోల్డ్‌మెడల్



శ్రీకాంత్

నాగారం : మండలంలోని వర్ధమానుకోట గ్రామానికి చెందిన వల్లాపురి శ్రీకాంత్‌కు మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ విభాగంలో గోల్డ్‌మెడల్ దక్కింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో మంగళవారం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వారు నిర్వహించిన 23వ స్నాతకోత్సవం (కాన్వొకేషన్)లో యూజీసీ చైర్మన్ జగదీశ్‌కుమార్ చేతుల మీదుగా ఆయన గోల్డ్‌మెడల్ అందుకున్నారు. శ్రీకాంత్‌కు గోల్డ్‌మెడల్ రావడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు బీఎస్పీ నాయకుల బైక్ ర్యాలీ

అర్వపల్లి : బహుజన్ సమాజ్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్, హైకోర్టు న్యాయవాది దందోలు తిరుపతి ఆధ్వర్యంలో జరిగే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు చెరుకుపల్లి లక్ష్మణ్ కోరారు. బీఎస్పీ శ్రేణులు బైక్‌లతో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.